వరంగల్ వాయిస్
Evening Daily
సంపుటి : 04 | సంచిక : 257
పేజీలు : 08 | వెల: రూ.5/-
సోమవారం
జూలై 14, 2025
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net



8లో..

## డాక్టర్స్ కాపురంలో రీల్స్ చిచ్చు

- 'బుట్ట బొమ్మ'పరిచయంతో కుటుంబంలో కలహాలు
- మనస్థాపంతో భార్య ప్రత్యూష ఆత్మహత్య
- నలుగురిపై కేసు నమోదు



# చినుకు రాలదు చింత తీరదు


- ముఖం చాటేసిన వరుణుడు
- జూలై ప్రారంభమై రెండు వారాలైనా వర్షాలు కరువే
- చుక్క నీరు లేక వెలవెలబోతున్న వాగులు, చెరువులు
- వర్షాభావంతో ప్రారంభం కాని వరి నాట్లు
- పత్తి మొక్కలకు బిందెలతో నీళ్లు

వానాకాలం సీజన్ ప్రారంభమై అప్పడే 45 రోజులు గడిచిపోయింది. అయినప్పటికీ ఆశించిన స్థాయిలో వర్షాలు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మే నెల చివరి వారంలోనే నైరుతి రుతుపవనాలు రాష్ట్రాన్ని తాకినప్పటికీ ఇప్పటి వరకు ఎక్కడ కూడా భారీ వర్షం కురిసిన దాఖలాలు లేవు. గత కొన్ని సంవత్సరాలుగా జూలై నెలలోనే భారీ వర్షాలు కురిసి వాగులు, వంకలు నిండు కుండల్లా కనిపించేవి. కానీ ఈ సంవత్సరం జూలై రెండో వారం ముగిసినప్పటికీ ఒక్కటంటే ఒక్కటి కూడా వ్యవసాయానికి పనికివచ్చే వర్షం నమోదు కాకపోవడం రైతుల్లో ఆందోళన కలిగిస్తోంది. దీనికితోడు వేసవిని తలపించేలా ఎండలు, నెర్రెలుబారిన పంట పొలాలు వ్యవసాయ రంగంపై నీలి నీడలను కమ్మేస్తున్నాయి. ఇప్పటికే వరి నాట్లు పూర్తి కావాల్సి ఉన్నప్పటికీ ఎక్కడ కూడా నాటిన దాఖలాలే లేవు. దీంతో ఈ సారి కాలం పోయిందన్న వాదనలు రైతుల నుంచి వినిపిస్తున్నాయి. అయితే ఈ ఏడు పంటలు పండక పోతే రైతుల పరిస్థితి ఏంటి అన్నది ప్రశ్నార్థకంగా మారింది.

- వరంగల్ వాయిస్, మల్హార్

వివరాలు 2లో..






8లో..

## బీసీలు ఏకం కావాలి

- 'ఛలో హైదరాబాద్' ను విజయవంతం చేయాలి
- ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్



2లో..

## బీజేపీలోకి నవనాయకుడు

- సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు ఉవ్విళ్లు
- గ్రామాల్లో పర్యటిస్తూ యువకుల్లో చైతన్యం నింపుతున్న నేత
- త్వరలో పార్టీలో చేరేందుకు రంగం సిద్ధం

# చినుకు రాలదు.. చింత తీరదు



- ముఖం చాటేసిన వరుణుడు
- జూలై ప్రారంభమై రెండు వారాలైనా వర్షాలు కరువే
- చుక్క నీరు లేక వెలవెలబోతున్న వాగులు, చెరువులు
- వర్షాభావంతో ప్రారంభం కాని వరి నాట్లు
- పత్తి మొక్కలకు బిందెలతో నీళ్లు

**వరంగల్ వాయిస్, మల్హర్ :** జూన్‌లో వర్షాలు తక్కువగా ఉండే లద్దాఖ్ ప్రాంతంలో ఈసారి సాధారణం కంటే 385 శాతం ఎక్కువగా వర్షపాతం నమోదైంది. మొన్నటిదాకా తీవ్రమైన కరువుతో నీటి ఎద్దడిని ఎదుర్కొన్న దేశ రాజధాని ఢిల్లీ ఇప్పుడు వరదలతో అతలాకుతలమవుతోంది. సాధారణంగా భారీ వర్షాలు కురిసి వాగులు, వంకలు, చెరువులు నీటితో కళకళలాడే తెలంగాణ ప్రాంతంలో ఈ ఏడాది భారీ లోటు కనిపిస్తోంది. భూగోళం వేడెక్కడం, తద్వారా వస్తున్న వాతావరణ మార్పుల వల్లే ఈ వైపరీత్యాలు సంభవిస్తున్నాయన్న వాదన బలంగా వినిపిస్తోంది.

### బిందెలతో నీళ్లు..

జూన్ నెల చివరిలో కురిసిన చిరు జల్లులకు రైతులు పత్తి విత్తనాలు నాటడంతో పాటు వరి నార్లు పోశారు. జూలై నెల మూడో వారం నుంచి వరి నాట్లు వేయాల్సి ఉండగా వర్షాలు లేక వాగులు, వంకలు ఎడారిని తలపిస్తున్నాయి. బోర్ల లోకి కూడా ఆశించిన స్థాయిలో నీరు రాలేదు. దీంతో కాటారం డివిజన్ వ్యాప్తంగా ఏ ఒక్క గ్రామంలో కూడా వరి నాట్లు ప్రారంభం కాలేదు. మరో వారం రోజులు ఇదే పరిస్థితి కొనసాగితే రైతులు తీవ్ర స్థాయిలో నష్ట పోవాల్సి వస్తుంది.

### కూరగాయల సాగుకు ఎండ తీవ్రత..

మండలంలోని కుంభంపల్లి, కొండంపేట గ్రామాల రైతులు ఎక్కవ స్థాయిలో కూరగాయల సాగు చేస్తారు. గత వారం రోజులుగా ఎండలు తీవ్ర స్థాయిలో ఉండటంతో రైతులు సాగు చేసిన చిక్కుడు, అలిశంత, బెండ, కాకరకాయ మొక్కలు ఎండిపోతున్నాయి. గత్యంతరం లేని పరిస్థితుల్లో రైతులు వాటిని కాపాడుకోవడానికి రోజు ఉదయం, సాయంత్రం బిందెలతో నీరు పోస్తుండటం తీవ్ర వర్షాభావ పరిస్థితులకు అద్దం పడుతుంది.

### వరి నాట్లూ వేయలే..

రానున్న వారం రోజులలో అతి భారీ వర్షాలు నమోదయ్యి వాగులు, చెరువుల్లోకి సమృద్ధిగా నీరు చేరితే తప్ప వరి నాట్లు వేసే పరిస్థితి కనిపించడం లేదు. వర్షాలు లేక భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. దీంతో బోర్లు కూడా సరిగా పోయకపోవడంతో బోర్ల కింద వరి సాగు చేసే రైతులు కూడా వరి నాట్లు వేయక వర్షాల కోసం ఎదురుచూస్తున్నారు. ఇదే పరిస్థితి జూలై చివరి వరకు కొనసాగితే ఖరీఫ్ సీజన్ రైతులకు కన్నీటిని మిగిల్చేలా ఉంది. ఆగస్టు వరకు భారీ వర్షాల సూచన లేదని వాతావరణ శాఖ అధికారుల ప్రకటన రైతులను మరింత ఆందోళనకు గురి చేస్తోంది.





# భాజాపాలోకి నవనాయకుడు

- సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు ఉవ్విళ్లు
- గ్రామాల్లో పర్యటిస్తూ యువకుల్లో చైతన్యం నింపుతున్న నేత
- త్వరలో పార్టీలో చేరేందుకు రంగం సిద్ధం

**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** డోర్నకల్ బీజేపీలో మరో ముఖచిత్రం ఆవిష్కృతం కాబోతోంది. డోర్నకల్ మండలం చాంప్లతండా గ్రామ పంచాయతీలోని ధరావత్ తండాకు చెందిన విద్యావంతుడు, వ్యాపార వేత, నవ యువ నాయకుడు బీజేపీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. దేశ ప్రధాని మోదీ చేపడుతున్న సంస్కరణలు, హిందుత్వ భావజాలంతో భాజపాలో చేరేందుకు ఉవ్విళ్లూరుతున్నారు. జూలై నెల చివరిలో కాని వచ్చే నెల మొదటి వారంలోకాని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ సమక్షంలో ఆ పార్టీలో చేరేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నారు. డోర్నకల్ నియోజకవర్గం ఎమ్మెల్యే స్థానాన్ని భాజాపా అభ్యర్థితో భర్తీ చేయడమే లక్ష్యంగా పార్టీని సంస్ధగతంగా బలోపేతం చేసేందుకు సదరు యువకుడు కాషాయం పార్టీలో చేరుతున్నట్టు తెలుస్తోంది. ఇందులో భాగంగా ఇప్పటికే రాష్ట్ర, జిల్లా నాయకులను కలిసి తాను పార్టీలో చేరేందుకు సంసిద్ధత వ్యక్తం చేసినట్లు సమాచారం. భారత ప్రధానిగా మోదీ ఇప్పటికే మూడు పర్యాయాలు బాధ్యతలు చేపట్టడంతోపాటు నాలుగో సారి కూడా బీజేపీ విజయం సాధించి ప్రధానిగా మోదీ బాధ్యతలు చేపట్టి నెహ్రూ, ఇందిరా గాంధీ రికార్డులను బద్దలు చేసేందుకు సంసిద్ధులౌతున్నట్లు సదరు యువ నాయకుడు చెప్పుకొస్తున్నారు. ఈ సమయంలో దక్షిణాదిన కూడా అత్యధికగా ఎమ్మెల్యే, ఎంపీ స్థానాలు కైవసం చేసుకునేందుకు బీజేపీ ఉవ్విళ్లూరుతోంది. ఈ నేపథ్యంలో హిందుత్వాని, దేశ భక్తిని వంటికిబట్టించిన ఈ యువ నాయకుడు రాజకీయ అరంగేట్రం ఒక సంచలనంగా మారనుంది. తన సొంత మండలం నుంచి రాజకీయాలు ప్రారంభించి ప్రజాసేవకు జీవితాన్ని అంకితం చేసేందుకు ఉత్సాహం చూపుతున్నారు. ఇప్పటికే డోర్నకల్ నియోజకవర్గంలోని ఆయా మండలాలు పర్యటిస్తూ భాజాపా కార్యకర్తలను కలుస్తూ మోదీని నాలుగోసారి ప్రధానమంత్రిగా చేయాల్సిన అవసరాన్ని నొక్కి చెబుతున్నారు. తన ప్రచారాన్ని కూడా ఇప్పటికే గ్రామ స్థాయిలో మొదలుపెట్టారు. స్థానిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో యువకులల్లో దేశభక్తిని నూరిపోసి రాజకీయలద్వారా



పదవులు అందుకొని ప్రజాసేవ చేయాలని పిలుపునిస్తున్నాడు. కాంగ్రెస్ ను నమ్మి చిత్తైన ప్రజలు భాజాపా అభ్యర్థులను గెలిపించి గ్రామాల్లో స్వరాజ్యం నిర్మించాలని సూచిస్తున్నాడు. భాజాపా అభ్యర్థులుగా సర్పంచ్, జడ్పీటీసీ, ఎంపీటీసీ, ఎంపీపీ వంటి పదవులు అందుకొని ప్రజలకు కేంద్ర ప్రభుత్వ పథకాలు అందించి తరించాలని కోరుతున్నారు. నూతనంగా ఓటు హక్కు పొందిన యువత బీజేపీ వైపు మొగ్గు చూపుతున్న ప్రస్తుత తరుణంలో సదరు యువ నాయకుడికి నియోజక ప్రజలు జేజేలు పలికే అవకాశం మెండుగా ఉంది.



# రవీందర్‌ను పరామర్శించిన ఎంపీ

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ జిల్లా నెక్కొండ మండలం సూరిపల్లి గ్రామంలో పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య వ్యక్తిగత సహాయకులు చెంగల రవీందర్ తండ్రి చెంగల మొగిలియ్య గౌడ్ ఇటీవల మృతి చెందగా సోమవారం వారి స్వగృహానికి చేరుకుని మొగిలియ్య గౌడ్ చిత్ర పటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కడియం కావ్య–డాక్టర్ నజీర్ దంపతులు పూల మాలలు వేసి ఆత్మకు శాంతి కలగాలని కోరారు. అనంతరం రవీందర్ కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ వెంట నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు, నాయకులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ అభివృద్ధిని విస్మరిస్తున్న బీజేపీ

◆ సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి ధ్వజం



**వరంగల్ వాయిస్, రేగొండ:** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజా సమస్యలను గాలికొదిలేసిందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు తీవ్ర స్థాయిలో విమర్శించారు. ఆదివారం రేగొండలోని ఎస్ఎల్ఎన్ ఫంక్షన్ హాల్‌లో జరుగుతున్న సీపీఐ జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మహాసభ ప్రారంభానికి ముందు తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు అరుణ పతాకాన్ని ఆవిష్కరించి అమరవీరుల స్థూపానికి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, తెలంగాణ అభివృద్ధికి నిధుల కేటాయింపులో కేంద్ర ప్రభుత్వం సవతి తల్లి ప్రేమ చూపిస్తోందని ఆరోపించారు. తెలంగాణ నుంచి ఎన్నికైన బీజేపీ పార్లమెంట్ సభ్యులు, మంత్రులు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి రాష్ట్రానికి రావలసిన ప్రాజెక్టులు, పరిశ్రమలు, నిధులు సాధించాలని డిమాండ్ చేశారు. బీజేపీయేతర ప్రభుత్వాలపై గవర్నర్ల వ్యవస్థతో పెత్తనం చెలాయించాలనే కుట్రను సుప్రీంకోర్టు ఇటీవల తప్పు పట్టిందని గుర్తు చేశారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక, రాజ్యాంగ వ్యతిరేక విధానాలను మానుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ప్రజా సమస్యలను గాలికొదిలి అధికార, విపక్ష పార్టీల నాయకులు సవాళ్లు, ప్రతి సవాళ్లు విసురుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రజలపై చిత్తశుద్ధి ఉంటే వారి సమస్యలపై దృష్టి సారించాలని ఆయన హితవు పలికారు. రానున్న రోజుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ పోరాటాలకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు.

## రేగొండలో సీపీఐ జిల్లా మహాసభలు..

రేగొండ మండల కేంద్రంలో సీపీఐ ఐదవ జిల్లా మహాసభలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా జరిగిన ప్రతినిధుల సభకు కొరిమి సుగుణ, సొత్కు ప్రవీణ్, క్యాతరాజు సతీష్ అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ జిల్లా నివేదికను ప్రవేశపెట్టారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు మామిడాల సమ్మిరెడ్డి, పైళ్ల క్రాంతి కుమార్, పెరుమాండ్ల రాజయ్య, కుడుదల వెంకటేష్, రామ్ చందర్, సుధాకర్ రెడ్డి, గుంటి చంద్రమౌళి, మండల కార్యదర్శి పెంట రవి, నూకల చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

# ఆర్థిక సాయం అందించాలి



**వరంగల్ వాయిస్, కేయూ:** కాకతీయ విశ్వవిద్యాలయంలో (కేయూ) తాత్కాలిక బోధనేతర ఉద్యోగులుగా పనిచేస్తూ అకాల మరణం పొందిన ఉద్యోగుల కుటుంబాలకు తక్షణమే ఆర్థిక సహాయం అందించాలని కేయూ రిజిస్ట్రార్ ఆచార్య వల్లూరు రామచంద్రంను కాంట్రాక్టు ఉద్యోగ సంఘం నాయకులు కోరారు. సోమవారం కాకతీయ విశ్వవిద్యాలయ బోధనేతర కాంట్రాక్టు ఉద్యోగ సంఘం ఆధ్వర్యంలో మరణించిన ఉద్యోగుల కుటుంబీకులతో కలిసి రిజిస్ట్రార్‌కు వినతి పత్రం సమర్పించారు. తాత్కాలిక ఉద్యోగి అకాల మరణం చెందితే ఆ కుటుంబానికి రూ. 5 లక్షలు ఇవ్వాలని విశ్వవిద్యాలయ ఉత్తర్వులు ఉన్నప్పటికీ, గత అధికారులు వాటిని అమలు చేయకపోవడంతో కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని సంఘ నాయకులు తెలిపారు. వెంటనే మరణించిన ప్రతి కుటుంబానికి రూ. 5 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. సమస్యను ఉపకులపతి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని రిజిస్ట్రార్ హామీ ఇచ్చినట్లు సంఘ నాయకులు పేర్కొన్నారు. రిజిస్ట్రార్‌ను కలిసిన వారిలో సంఘ నాయకులు డాక్టర్ పొడిచెట్టి విష్ణువర్ధన్, నాగుల శివప్రసాద్, కొడవటిగంటి దయాకర్, బొచ్చు గోపి, మరణించిన ఉద్యోగుల కుటుంబ సభ్యులు తదితరులు ఉన్నారు.

# నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఇన్నర్ వీల్ వరంగల్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి పద్మావతి కాలేజీ మాజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జానకి ముఖ్య అతిథిగా, గౌరవ అతిథిగా అసోసియేషన్ కోశాధికారిణి పద్మ శర్మ హాజరయ్యారు. నూతన అధ్యక్షురాలిగా ఎన్నికైన మర్రి రేణుకకు లావణ్య కాలర్ వేసి ప్రెసిడెంట్ పిన్ అలంకరించారు. కార్యదర్శిగా వి. అర్చన నియమితులయ్యారు. ఈ సందర్భంగా క్లబ్ పలు సేవా కార్యక్రమాలను చేపట్టింది. లూయిస్ బ్లైండ్ స్కూల్ ఉపాధ్యాయులకు రూ.10,000 ఆర్థిక సహాయం అందజేశారు. అలాగే, ఎస్ఎస్‌సీ పబ్లిక్ పరీక్షలలో 10/10 మార్కులు సాధించిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సులోచన అవార్డులు ప్రదానం చేశారు. ప్రతి విద్యార్థికి రూ. 1,000 నగదు బహుమతితో పాటు నోటు పుస్తకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పీడీసీలు, క్లబ్ సభ్యులు కూడా హాజరయ్యారు.



# ‘మన ఊరు మన బడి’ కాంట్రాక్టర్ల ఆందోళన

■ పెండింగ్ బిల్లులకై విద్యాశాఖ కార్యాలయం ఎదుట ధర్నా




**వరంగల్ వాయిస్, పరకాల:** ‘మన ఊరు మన బడి’ పథకం కింద చేసిన పనులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణలోని అన్ని జిల్లాల కాంట్రాక్టర్లు సోమవారం హైదరాబాద్‌లోని కమిషనర్ డైరెక్టర్ స్కూల్ ఎడ్యుకేషన్ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2022–23 సంవత్సరంలో ‘మన ఊరు మన బడి’ పథకంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అభివృద్ధి చేసేందుకు కృషి చేసింది. శిథిలావస్థలో ఉన్న తరగతి గదులు, డైనింగ్ హాళ్లు, టాయిలెట్లు, కాంపౌండ్ వాల్ నిర్మాణం, విద్యుదీకరణ పనులు (లైటింగ్, ఫ్యాన్‌లు) వంటివి కార్పొరేట్ పాఠశాలల స్థాయిలో చేపట్టారు. గత ప్రభుత్వం బిల్లులు చెల్లిస్తూ పనులు చేయించిందని కాంట్రాక్టర్లు తెలిపారు. అయితే, ప్రస్తుతం ఉన్న ప్రభుత్వం గత 19 నెలలుగా బిల్లులు చెల్లించకుండా తమను ఇబ్బందులకు గురిచేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై కలెక్టర్‌కు ఆరుసార్లు, ప్రజాభవన్‌కు, కమిషనర్ డైరెక్టర్ విద్యాశాఖకు నాలుగుసార్లు వినతిపత్రాలు సమర్పించినా ఎటువంటి ప్రయోజనం లేకపోవడంతో తాము ఈ ధర్నాకు దిగినట్లు కాంట్రాక్టర్లు పేర్కొన్నారు. కాంట్రాక్టర్లు మాట్లాడుతూ విద్యాశాఖ ముఖ్యమంత్రి కార్యాలయానికి దగ్గర్లోనే ఉన్నందున, తమ బిల్లులను వెంటనే విడుదల చేయాలని కోరారు. పనుల కోసం అప్పులు చేసి, వడ్డీలు కట్టలేక తమ కుటుంబాలు రోడ్డున పడ్డాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ధర్నా అనంతరం కాంట్రాక్టర్లు అందరూ కలిసి కమిషనర్ డైరెక్టర్ నవీన్ నికోలస్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఊర రవీందర్‌రావుతో పాటు తెలంగాణలోని వివిధ జిల్లాల కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

# 15న వరుణ దేవుడి పూజ

కప్పతల్లి ఆటతో ఊరేగింపు



**వరంగల్ వాయిస్, గణపురం:** వర్షాలు సమృద్ధిగా కురవాలని ఆకాంక్షిస్తూ గణపురం మండల కేంద్రంలోని ప్రసిద్ధ శ్రీ పట్టాభి సీతారామచంద్రస్వామి ఆలయంలో వరుణ దేవుని పూజా కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆలయ కమిటీ నిర్ణయించింది. దీనిలో భాగంగా మంగళవారం ఉదయం 9 గంటలకు రామాలయంలో వరుణ దేవుని పూజ మొదలవుతుంది. ఈ పూజానంతరం గ్రామోత్సవంగా కప్పతల్లి ఆటలతో శ్రీ పట్టాభి సీతారామచంద్రస్వామి విగ్రహాన్ని పురవీధులలో ఊరేగింపుగా తీసుకువస్తారని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ పూజా కార్యక్రమంలో శ్రీరామ భక్తులు, ప్రజలు, రైతులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని వర్షాలు సమృద్ధిగా పడాలని ప్రార్థించాలని ఆలయ కమిటీ కోరింది. ఈ సంవత్సరం వర్షాలు సమృద్ధిగా కురిసి పంట దిగుబడి బాగా రావాలని ఆకాంక్షిస్తూ శ్రీ పట్టాభి సీతారామచంద్రస్వామి వారికి ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షులు తాళ్లపల్లి గోవర్ధన్ గౌడ్ తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ రైతులు, భక్తులు కూడా ఇదే కోరుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు.

# అనాథ పిల్లలకు పండ్ల పంపిణీ



**వరంగల్ వాయిస్, పరకాల :** పట్టణంలోని సీఎస్ఐ ఆశ్రమ పాఠశాలలో బాలబాట వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ పి.రంజన్ బాబు పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అనాథ ఆశ్రమ పిల్లలకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కార్డ్స్ బాలబాట ములుగు జిల్లా ఆర్సీఓ సీపతి రాజు మాట్లాడుతూ, దళిత బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి రంజన్ బాబు అనేక సేవా కార్యక్రమాలను తమ స్వచ్ఛంద సంస్థ ద్వారా అందిస్తున్నారని కొనియాడారు. కార్డ్స్ బాలబాట డైరెక్టర్ ఫ్రాంక్ విశ్వనాథ్, మేరీ మేడమ్, తెలంగాణ డైరెక్టర్ రజిని, డీడీ దివ్య ములుగు ఏజెన్సీ ప్రాంతంలో సేవ చేసే అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్డ్స్ బాలబాట సభ్యులు ఏకు హరి, సాధు దిలీప్, ఏకు అశోక్, అరవింద్, రేవంత్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

# క్యూ న్యూస్ కార్యాలయంపై దాడిని ఖండిస్తున్నాం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** మేడ్చల్ జిల్లా మేడిపల్లిలోని క్యూ న్యూస్ కార్యాలయంపై జరిగిన దాడిని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు తీవ్రంగా ఖండించారు. దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో భౌతిక దాడులకు తావులేదని ఆయన స్పష్టం చేశారు. జాగృతి అధ్యక్షురాలు కవితపై తీన్మార్ మల్లన్న అలియాస్ నవీన్ అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేశారని చెబుతూ కొందరు అందుకు ప్రతీకారంగా క్యూ న్యూస్ కార్యాలయంపై దాడి చేసి కంప్యూటర్లు, ఫర్నిచర్, కిటికీల అద్దాలు ధ్వంసం చేయడం, సిబ్బందిపై దాడి చేయడం అమానుషమని ఆయన అన్నారు. ఈ దాడిలో మల్లన్న చేతికి గాయాలయ్యాయని, ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు ఈ దాడిని తీవ్రంగా ఖండించాలని వెంకట్రాములు పిలుపునిచ్చారు. ఇటీవల నాగోలులో పాలస్తీనాపై ఇజ్రాయెల్, అమెరికా దాడులను నిరసిస్తూ శాంతియుతంగా ఆందోళన చేస్తున్న అఖిల భారత విద్యార్థి సమాఖ్య కార్యకర్తలపై బీజేవైఎం కార్యకర్తలు దాడి చేయడాన్ని కూడా వెంకట్రాములు మరొక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. దాడులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని వెంకట్రాములు డిమాండ్ చేశారు.

# విద్యార్థులకు షూలు, సాక్సుల పంపిణీ



**వరంగల్ వాయిస్, వరంగల్:** వరంగల్‌లోని ఏవీవీ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం స్కూల్ షూలు, సాక్సులు పంపిణీ చేశారు. మట్టెవాడ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గోపి, స్థానిక కార్పొరేటర్ దేవరకొండ విజయలక్ష్మి సురేందర్, వరంగల్ ప్రముఖ వ్యాపారవేత్త, వెంకటేశ్వర గార్డెన్ యజమాని శ్రీరాం ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మొత్తం 150 మంది పాఠశాల విద్యార్థులకు షూలు, సాక్సులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భుజేందర్ రెడ్డి, ఏవీవీ విద్యాసంస్థల కార్యదర్శి డా.చందా విజయ్ కుమార్, శాశ్వత సభ్యులు చందా శ్రీకాంత్, స్థానిక నాయకులు పులుగం సదానందం, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణికి 75 ఫిర్యాదులు

### జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్



**వరంగల్ వాయిస్, ములుగు :** ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే ఫిర్యాదులకు ప్రాధాన్యతనిస్తూ త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 75 దరఖాస్తులు రాగా అత్యధికంగా గృహ నిర్మాణ శాఖకు 30, భూ సమస్యలు 25, ఉపాధి కల్పనకు 02, పెన్షన్ 03, ఇతర శాఖలకు సంబంధించినవి 15 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ తో పాటు, అదనపు కలెక్టర్ రెవెన్యూ సీహెచ్ మహేందర్ జి, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావులకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఫిర్యాదులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ అర్జీదారులకు సమాచారం తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వెంకటేష్ వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# బీజేవైఎం దుండగులను అరెస్టు చేయాలి



**వరంగల్ వాయిస్, శివనగర్:** ఏఐఎస్ఎఫ్ (ఆల్ ఇండియా స్టూడెంట్స్ ఫెడరేషన్) నాయకులపై జరిగిన దాడులను తీవ్రంగా ఖండించాలని, దాడికి యత్నించిన బీజేవైఎం (భారతీయ జనతా యువ మోర్చా) దుండగులను తక్షణమే అరెస్టు చేయాలని ఏఐఎస్ఎఫ్ వరంగల్ జిల్లా కార్యదర్శి ల్యాదళ్ల శరత్ డిమాండ్ చేశారు. దాడులను నిరసిస్తూ ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో వరంగల్‌లో ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శరత్ మాట్లాడుతూ నిరసన తెలిపే హక్కును అడ్డుకున్న సంఘపరివార్ దుండగులను అరెస్టు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. దాడులకు పాల్పడితే తాము చూస్తూ ఊరుకోమని, తాము కూడా ప్రతిదాడులకు పాల్పడే ధైర్యం ఉందని, కానీ రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులు గుర్తొస్తున్నాయని, అందుకే సంయమనం పాటిస్తున్నామని శరత్ అన్నారు. దాడికి యత్నించిన బీజేవైఎం నేతలను గుర్తించి పోలీసులు తక్షణమే అరెస్టు చేయాలని, లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శివ సంతోష్, ప్రశాంత్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# వాటర్ ప్లాంట్‌కు మరమ్మతులు చేయండి

### ◆ గ్రామస్తుల డిమాండ్




**వరంగల్ వాయిస్, పర్వతగిరి:** మండలంలోని అన్నారం గ్రామస్తులు తమ గ్రామ పంచాయతీ మినరల్ వాటర్ ప్లాంట్ నిర్వహణపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత పదేళ్లుగా పనిచేయకుండా నిరుపయోగంగా పడి ఉన్న ఈ ప్లాంట్‌కు మరమ్మతులు చేయాలని పదే పదే విజ్ఞప్తి చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. దీనివల్ల తాగునీటి కోసం ప్రైవేట్ సరఫరాదారులపై ఆధారపడాల్సి వస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్లాంట్‌ను వెంటనే మరమ్మతు చేసి గ్రామస్థులకు స్వచ్ఛమైన తాగునీటిని అందించడానికి గ్రామ పంచాయతీ తక్షణ చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు గ్రామ ప్రత్యేక అధికారి జోక్యం చేసుకోవాలని కూడా వారు కోరుతున్నారు.

### అధికారులు తక్షణమే స్పందించాలి..

గ్రామ పంచాయతీ వాటర్ ప్లాంట్ అందుబాటులో లేకపోవడం వల్ల ప్రైవేట్ సరఫరాదారులపై ఆధారపడాల్సి వస్తుందని, ఇది తమపై ఆర్థిక భారం మోపుతోందని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. గ్రామ పంచాయతీ ఈ మినరల్ వాటర్ ప్లాంట్ మరమ్మతుకు ప్రాధాన్యత ఇచ్చి, గ్రామస్తులకు ఉచితంగా లేదా తక్కువ ధరకు మంచినీటిని అందించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. అధికారులు తక్షణమే స్పందించి వాటర్ ప్లాంట్‌కు మరమ్మతులు చేసి గ్రామస్తులకు మంచినీరు లభించేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# జనగామలో వనమహోత్సవం

### ◆ అంగన్‌వాడీ కేంద్రాల్లో మొక్కలు నాటిన కలెక్టర్



**వరంగల్ వాయిస్, జనగామ:** స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పసరమడ్ల అంగన్‌వాడీ కేంద్రాల్లో మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. వనమహోత్సవం లక్ష్యం మేరకు స్త్రీ, శిశు సంక్షేమ శాఖకు కేటాయించిన 500 మొక్కలు నాటాలన్న లక్ష్యానికి అనుగుణంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ మొక్కను నాటారు. కాలుష్య రహితంగా మారుతున్న పర్యావరణాన్ని కాపాడుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఈ సందర్భంగా కలెక్టర్ అన్నారు. అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో పండ్ల, ఔషధ మొక్కలను నాటడం ద్వారా అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లల పోషకాహార స్థాయిని కూడా మెరుగుపరచవచ్చని ఆయన సూచించారు. అనంతరం కేంద్రంలో ఉన్న గర్భిణులు, బాలింతలతో మాట్లాడి అంగన్‌వాడీ సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలో ఉన్న గుడ్లు, పప్పు నిల్వల నాణ్యతను పరిశీలించారు. ప్రీస్కూల్ పాఠ్యాంశాలు ఏ విధంగా బోధిస్తున్నారని పిల్లలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్త్రీ, శిశు సంక్షేమ అధికారిణి ఫ్లోరెన్స్, సీడీపీఓ సత్యవతి, సూపర్వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు, గ్రామ సిబ్బంది పాల్గొన్నారు.

# కేయూ భూములను కాపాడాలి



**వరంగల్ వాయిస్, వరంగల్:** కాకతీయ విశ్వవిద్యాలయం భూములను పరిరక్షించాలని, విశ్వవిద్యాలయ భూములలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణం చేపట్టవద్దని డిమాండ్ చేస్తూ కేయూ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఎంసీపీఐ(యు) తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గాదగోని రవి మాట్లాడుతూ విశ్వవిద్యాలయానికి భవిష్యత్తులో అనేక రకాల కోర్సులు అందుబాటులోకి వస్తాయని వాటికి అనుగుణంగా భవనాలు, విద్యార్థులకు సరిపడా హాస్టళ్లు, నూతన ఆవిష్కరణల కోసం రీసెర్చ్ సెంటర్లు, అధ్యయన కేంద్రాలకు చాలా భూములు అవసరమవుతాయని అన్నారు. కాబట్టి, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూలు నిర్మాణం కోసం విశ్వవిద్యాలయ పాలకమండలి 15 ఎకరాలను కేటాయిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ మాస్ సావిత్రి, ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర కార్యదర్శి గడ్డం నాగార్జున, డీఎస్ఏ రాష్ట్ర కన్వీనర్ కామగోని శ్రావణ్, పీడీఎస్‌యూ ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యదర్శి మర్రి మహేష్, ఎస్ఎస్‌యూ జిల్లా అధ్యక్షులు ఎల్తూరి సాయికుమార్, ఏఐడీఎస్ఓ జిల్లా ఉపాధ్యక్షులు మధుసూదన్ లతో పాటు విద్యార్థి సంఘ నాయకులు ఉప్పుల శివ, రాజు, చెట్టుపల్లి శివ కుమార్, రాజేష్ పాల్గొన్నారు.

# బ్లాక్‌మెయిల్ రాజకీయాలు మానుకోవాలి

### ◆ దిలీప్ కు కాంగ్రెస్ నాయకుల వార్నింగ్




**వరంగల్ వాయిస్, హుజురాబాద్:** బీఆర్ఎస్ పార్టీ నాయకుడు దిలీప్‌ను కాంగ్రెస్ పార్టీలోకి చేర్చుకోలేదనే అక్కసుతోనే ప్రణవ్ బాబుపై విమర్శలు చేస్తున్నాడని కాంగ్రెస్ పార్టీ యువజన నాయకుడు సందమల్ల నరేష్ ఆరోపించారు. సోమవారం హుజురాబాద్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ములుగు దిలీప్ ఒక బ్లాక్‌మెయిల్ అని, అక్రమ దందాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారారని నరేష్ అన్నారు. చెల్లెలి కౌన్సిలర్ పదవిని అడ్డం పెట్టుకొని అక్రమ దందాలు చేసే దిలీప్‌కు ప్రణవ్ బాబును విమర్శించే నైతిక స్థాయి లేదని ఆయన దుయ్యబట్టారు. స్థానిక ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి హుజురాబాద్ ప్రజలను బ్లాక్‌మెయిల్ చేసి, సెంటిమెంట్‌తో గెలిస్తే, బ్లాక్‌మెయిల్ నాయకుడికి బ్లాక్‌మెయిల్ శిష్యులే ఉంటారని మరోసారి రుజువు చేశారని నరేష్ విమర్శించారు.ఇదే దిలీప్ పార్లమెంటు ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీలో చేరడానికి సిద్ధమైతే, ఇతని ప్రవర్తన వలన తిరస్కరించామని నరేష్ గుర్తు చేశారు. జమ్మికుంట అంగడి టెండర్ రూపంలో రూ.30 లక్షల 3 వేల ప్రభుత్వ సొమ్మును కాజేస్తే ఓ.ఎస్ నెంబర్ 59/2017 కింద దిలీప్‌పై కేసు నమోదైంది నిజం కాదా అని ఆయన ప్రశ్నించారు. ప్రణవ్ ఎవరిని చూసి రాజకీయం నేర్చుకోవాల్సిన అవసరం లేదని, రాజకీయాల్లో వారీ ఇంట్లో పుట్టిందే అని, అది మర్చిపోకూడదని నరేష్ అన్నారు. పాడి కౌశిక్ రెడ్డి అనుచరులు చిల్లర మాటలు, అసత్య ఆరోపణలు, అనుచిత వ్యాఖ్యలు చేస్తే బట్టలు ఊడదీసి కొడతామని ఆయన తీవ్రంగా హెచ్చరించారు. ఈ విలేకరుల సమావేశంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ దుబాసి బాబు, సీనియర్ నాయకులు సందమల్ల బాబు, బత్తిని రవీందర్ గౌడ్, బండ నవీన్, ముక్క రవితేజ, కె.ఆర్.బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేదలకు సంక్షేమ పథకాలు అందాలి

■ జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**వరంగల్ వాయిస్, జనగామ:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న వివిధ సంక్షేమ పథకాల అమలులో జిల్లా అధికారులు పూర్తిగా భాగస్వామ్యమై అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ఫలాలను అందించాలని జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. సోమవారం గ్రీవెన్స్ కార్యక్రమం అనంతరం వివిధ అంశాలపై శాఖల వారీగా జిల్లాస్థాయి అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. నియోజకవర్గ స్థాయిలో జరిగే ఇందిరా మహిళా శక్తి సంబరాలు ఘనంగా జరిగేలా మండల స్పెషల్ అధికారులు పర్యవేక్షణ చేయాలని సూచించారు. అలాగే, రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియ సజావుగా జరగాలని, ఎక్కడా ఎలాంటి ఇబ్బంది తలెత్తకూడదని స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల గ్రౌండింగ్ ప్రక్రియ వేగవంతం కావాలని కలెక్టర్ ఆదేశించారు. టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం పక్కాగా జరగాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే, రెవెన్యూ శాఖకు సంబంధించి భూ భారతి సదస్సులో వచ్చిన దరఖాస్తుల క్షేత్రస్థాయి విచారణ పూర్తి కావాలన్నారు. ఈ సమీక్షలో అదనపు కలెక్టర్లు పింకేష్ కుమార్, రోహిత్ సింగ్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, ఆర్డీవోలు, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

## లాదెళ్లలో ప్రభుత్వ భూముల కబ్జా

### కలెక్టర్‌కు గ్రామస్తుల ఫిర్యాదు

**వరంగల్ వాయిస్, దామెర:** హనుమకొండ జిల్లా దామెర మండలంలోని లాదెళ్ల గ్రామ శివారులో జరుగుతున్న అక్రమ భూ కబ్జాలపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ సోమవారం కలెక్టర్ కార్యాలయ గ్రీవెన్స్ సెల్‌లో ఫిర్యాదు చేశారు.గ్రామస్తులు తమ ఫిర్యాదులో ప్రధానంగా మూడు అంశాలను ప్రస్తావించారు. పల్లె ప్రకృతి వనం సమీపంలోని ప్రభుత్వ స్థలంలో గ్రామానికి చెందిన భీమారపు రాజయ్య అక్రమంగా నిర్మాణాలు చేపట్టి, హోటల్ పేరుతో బెల్ట్ షాప్ నడుపుతున్నారని పేర్కొన్నారు. అదేవిధంగా, గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ ప్రభుత్వ పాఠశాల నిర్మాణం కోసం పెసరు సూర్యప్రకాశ్ రెడ్డి వేరే వ్యక్తుల నుంచి కొనుగోలు చేసి 1.34 గుంటల భూమిని భూదానం చేయగా, ఆ భూమిని కూడా పక్క రైతులు ఆక్రమించారని గ్రామస్తులు ఆరోపించారు. ఇంకా, గ్రామంలోని శ్రీ భోగేశ్వర ఆలయ భూమి కూడా ఆక్రమణకు గురయ్యే ప్రమాదం ఉందని, ఆ భూమిపై సర్వే చేసి, హద్దులు నిర్ణయించి రక్షణ చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరారు. ఈ విషయాలపై తక్షణ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను గ్రామ ప్రజలు విజ్ఞప్తి చేశారు. ఈ ఫిర్యాదులో మాజీ సర్పంచ్ మదాసు వెంకటేశ్వర్లు, భీమారపు రాజు, జెల్లా ప్రవీణ్ పాల్గొని తమ సంతకాలతో వినతిపత్రాన్ని సమర్పించారు.

## సిద్ధోజు నీతీష్‌కు మహాత్మా చరఖా అవార్డు




**వరంగల్ వాయిస్, వరంగల్:** వరంగల్‌కు చెందిన జర్నలిస్ట్ సిద్ధోజు నీతీష్ సోమవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో జరిగిన 'మహాత్మా గాంధీ సుస్థిర విజ్ఞాన సదస్సు'లో మహాత్మా చరఖా అవార్డును అందుకున్నారు. గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ 50 సంవత్సరాల స్వర్ణోత్సవాల సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు జర్నలిస్టులు, ఇతర ప్రముఖులు సిద్ధోజు నీతీష్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

## ఘనంగా రైతు నాయకుడి జన్మదిన వేడుకలు



**వరంగల్ వాయిస్, నడికూడ:** రైతు రక్షణ సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వరికేల కిషన్ రావు జన్మదిన వేడుకలు నడికూడ మండల కేంద్రంలో ఘనంగా జరిగాయి. ఆరె సంక్షేమ సంఘం మండల అధ్యక్షులు లోకేటి నగేష్ ఆధ్వర్యంలో ఈ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా కిషన్ రావును శాలువాతో సన్మానించి, కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరె సంక్షేమ సంఘం నడికూడ మండల అధ్యక్షులు లోకేటి నగేష్, జీల కుమార స్వామి, నారాగాని రాజేష్, ఓదెల పవన్ కుమార్, మోకిడి రాజు, లోకాటి శీను, ఉల్లాజీ పూర్ణచందర్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన



**వరంగల్ వాయిస్, గణపురం:** మండలంలోని మూడు గ్రామాల్లో సోమవారం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు రూ. 52 లక్షల విలువైన అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ధర్మారావుపేటలో రూ. 10 లక్షలతో నిర్మించిన శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవాలయాన్ని ప్రారంభించారు. అలాగే, బసవయ్యపల్లిలో రూ. 12 లక్షలతో నిర్మించనున్న అంగన్‌వాడీ భవనానికి, రూ. 20 లక్షలతో నిర్మించనున్న గ్రామ పంచాయతీ కార్యాలయ భవనానికి శంకుస్థాపన చేశారు. గొల్లపల్లిలో రూ. 10 లక్షలతో నిర్మించనున్న పోచమ్మ గుడి రోడ్డుకు కూడా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు రేపాక రాజేందర్, నాయకులు కృష్ణ ఇన్ శివశంకర్ గౌడ్, వి. నారాయణ, దుర్గయ్య, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**వరంగల్ వాయిస్, కరీమాబాద్:** వరంగల్ నగరంలోని శంభునిపేటలో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2017–18 విద్యా సంవత్సరంలో పదవ తరగతి పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన ప్రధానోపాధ్యాయులు శారదాబాయి, జీవన్ కుమార్, ఉపాధ్యాయులు బండ రవీందర్, పెరుమాండ్ల సాంబమూర్తి, భాస్కర్, శేషాచారి, శ్రీధర్, రవీంద్రబాబులను పూర్వ విద్యార్థులు శాలువాలతో సన్మానించి బహుమతులు అందజేశారు. అనంతరం పూర్వ విద్యార్థులందరూ ఒకరికొకరు పరిచయాలు చేసుకున్నారు. తమ జీవన ప్రయాణంలో పాఠశాల ఉపాధ్యాయుల బోధన ఎంతో ఉపయోగపడిందని పలువురు పూర్వ విద్యార్థులు ఈ సందర్భంగా తెలిపారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. ఉన్నత విద్యను పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థులకు అభినందనలు తెలిపారు. లక్ష్య సాధనకు నిరంతరం శ్రమించాలని సూచించారు. తల్లిదండ్రుల బాధ్యతను ఎప్పుడూ మరవకూడదని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని కోరారు. ఉన్నత విద్యను కొనసాగించేందుకు ప్రయత్నించాలని ఉద్బోధించారు. పూర్వ విద్యార్థులు వి.గౌతమ్, డి.కిరణ్, సమీరుద్దీన్, రియాజ్, రవితేజ, అబ్రార్, షాహీర్, గోపి సింగ్, ధనుష్, ఖాద్రి, అజ్మీర్, కమలుద్దిన్, షకీల్, ముజాహిద్, మొయిజ్, పలువురు పూర్వ విద్యార్థినిలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఉప్పల్ రైల్వే ఫ్లైఓవర్ అసంపూర్తి నిర్మాణంపై కాంగ్రెస్ నిరసన



**వరంగల్ వాయిస్, కమలాపూర్:** మండలంలోని ఉప్పల్ రైల్వే ఫ్లైఓవర్ అసంపూర్తి నిర్మాణం వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తవుటం ఝాన్సీ రాణి రవీందర్ ఆధ్వర్యంలో మారేపల్లి మహేష్, మొండెద్దుల నాగరాజు, విష్ణుదాసు వంశధరావు, గూడెపు మొగిలయ్య, గణేష్, సత్యపాల్, రాజేష్ తదితరులు ఈ ఆందోళనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఉప్పల్ రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం ప్రారంభించి ఆరు సంవత్సరాలు దాటిపోయినా పూర్తి కాకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. 11 సంవత్సరాలుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వానికి, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రిగా ఉన్న బండి సంజయ్‌కి ఇది కనబడటం లేదా అని ప్రశ్నించారు. గత జూన్ చివరి వారంలో బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయకపోతే బుల్డోజర్లతో ఇప్పటివరకు జరిగిన నిర్మాణాన్ని కూల్చివేస్తామని జిల్లా బీజేపీ అధ్యక్షుడు ఈ బ్రిడ్జి వద్దకు వచ్చి పత్రికా ప్రకటన ఇచ్చారని కాంగ్రెస్ నాయకులు గుర్తు చేశారు. మరి గడువు దాటిపోయింది కాబట్టి, బ్రిడ్జిని బుల్డోజర్లతో కూలగొడతారా లేక నిర్మాణం పూర్తి చేస్తారా ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రయాణికులు ఒక్కోసారి గంట సమయం వరకు గేటు తీయలేని పరిస్థితిలో నరకాన్ని అనుభవిస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కాబట్టి, తక్షణమే రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయకపోతే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇక్కడ ధర్నా కార్యక్రమం, రైలు రోకో కార్యక్రమం చేపడతామని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ తవుటం ఝాన్సీ రాణి రవీందర్ బండి సంజయ్‌ని హెచ్చరించారు.

## బైక్ దొంగ అరెస్ట్




**వరంగల్ వాయిస్, క్రైం :** మట్టెవాడ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆటోనగర్ జంక్షన్ వద్ద సోమవారం వాహనాల తనిఖీ చేస్తుండగా పోలీసులు ఒక బైక్ దొంగను అరెస్ట్ చేశారు. అతడిని పోచమ్మైదాన్‌కు చెందిన బరపట్ల సాయిగా గుర్తించారు. సాయి ఇంతేజార్‌గంజ్, మట్టెవాడ పోలీస్ స్టేషన్లలో నమోదైన మోటార్ సైకిల్ దొంగతనాలు, కిరాణా షాపులు, ఇళ్లు, బార్ షాపుల్లో జరిగిన దొంగతనాలకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. కొద్ది రోజుల క్రితం వరంగల్ అండర్ బ్రిడ్జి వద్ద ఒక మోటార్ సైకిల్‌ను దొంగతనం చేసి దానిపై తిరుగుతూ ఈ దొంగతనాలకు పాల్పడ్డాడు. ఇటీవలే దేశాయిపేట రోడ్డులోని 60 ఫీట్ రోడ్డు వద్ద దొంగతనం చేసిన మోటార్ సైకిల్‌తో ప్రమాదం చేసి వాహనాన్ని అక్కడే వదిలేసి పరారయ్యాడు. ఆ తర్వాత, ఈ నెల 10 సాయంత్రం దేశాయిపేట రోడ్డులోని ఉమా బుక్ స్టాల్ వద్ద ఉన్న మోటార్ సైకిల్‌ను దొంగతనం చేసి, మరిన్ని నేరాలు చేసేందుకు ప్రయత్నిస్తుండగా సోమవారం పట్టుబడ్డాడు. నిందితుడు సాయి గతంలో కూడా వివిధ పోలీస్ స్టేషన్లలో పలు దొంగతనాలు చేసి జైలు శిక్ష అనుభవించాడు. గత నెల రోజుల క్రితమే జైలు నుంచి విడుదలైనట్లు పోలీసులు తెలిపారు. సాయి వద్ద దొంగిలించిన మోటార్ సైకిల్‌ను సీజ్ చేసి, అతడిని కోర్టుకు పంపినట్లు మట్టెవాడ పోలీసులు వెల్లడించారు.

## ట్రాఫిక్ కానిస్టేబుల్ నిజాయితీ

### దొరికిన స్మార్ట్‌ఫోన్ బాధితుడికి అప్పగింత



**వరంగల్ వాయిస్, కాజీపేట:** హనుమకొండ వడ్డేపల్లి చర్చి వద్ద విధులు నిర్వహిస్తున్న కాజీపేట ట్రాఫిక్ కానిస్టేబుల్ దేవేందర్ తన నిజాయితీని చాటుకున్నారు. సోమవారం విధుల్లో ఉండగా అతనికి ఒక స్మార్ట్‌ఫోన్ దొరికింది. దేవేందర్ వెంటనే ఆ ఫోన్ యజమాని వివరాలను తెలుసుకునే ప్రయత్నం చేశారు. రెడ్డి కాలనీకి చెందిన గోవిందుల రవీందర్ ఫోన్ యజమానిగా గుర్తించి, ఆ ఫోన్‌ను అతనికి తిరిగి అప్పగించారు. దేవేందర్ చేసిన ఈ మంచి పనికి సీఐ వెంకన్నతో పాటు పలువురు ప్రశంసించారు.

# రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో ఉండాలి

## హనుమకొండ ఏసీపీ నర్సింహారావు



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో ఉండాలని హనుమకొండ ఏసీపీ నర్సింహారావు తీవ్రంగా హెచ్చరించారు. సోమవారం హనుమకొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లకు ఆయన కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. రౌడీ షీటర్లు భూతగాదాలు, కొట్లాటలు, బెదిరింపులకు పాల్పడితే వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విధంగా ప్రవర్తిస్తే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు. చిన్నపాటి కేసుల్లో కూడా తలదూర్చకుండా సత్ప్రవర్తనతో ఉండాలని ఆయన సూచించారు. ఈ కౌన్సిలింగ్‌లో సీఐ మచ్చ శివకుమార్, ఎస్సైలు కిషోర్, సతీష్ పాల్గొన్నారు.

# మెతుకు ఉప్పలయ్యకు పురస్కారం



**వరంగల్ వాయిస్, మేడ్చల్:** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా, ఓల్డ్ నేరేడ్‌మెట్‌కు చెందిన మెతుకు ఉప్పలయ్యకు 'తెలంగాణ సంస్కృతి సాహితీ బుక్ ఆఫ్ రికార్డ్స్ 2025' జాతీయ పురస్కారం లభించింది. తెలుగు సంస్కృతి సాహితీ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో వరంగల్‌లోని రామయ్య ఫంక్షన్ హాల్‌లో సత్కారంతో ఆయనను సన్మానించారు. సామాజిక సేవా విభాగంలో ఉప్పలయ్య చేసిన విశేష కృషిని గుర్తించి ఈ జాతీయ పురస్కారాన్ని అందజేశారు. పేదల సంక్షేమం, కార్మికుల, ప్రైవేటు ఉద్యోగుల సంక్షేమం, అవినీతి నిర్మూలన వంటి అంశాలలో ఆయన తన వంతు కృషి చేస్తున్నారు. ఎలాంటి ఆస్తి, ఆదాయం, డబ్బు ఆశ లేకుండా తన కుటుంబ పెద్దలకు (తల్లి, తండ్రి, అమ్మమ్మకు) సేవలు చేసిన తన భార్య విజయలక్ష్మి సమాజంలో ఆదర్శంగా నిలిచిందని ఉప్పలయ్య కొనియాడారు. తన కుటుంబ సమస్యల పరిష్కారంలో ఆమె ఓర్పుతో, సహకారంతో అందిస్తున్నట్లు తెలిపారు.

# గ్రామ కార్యదర్శిపై కలెక్టర్‌కు ఫిర్యాదు



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** మండలంలోని గూడెంపాడు గ్రామ పంచాయతీ కార్యదర్శి పంచాయతీ నిధులను దుర్వినియోగం చేశారని ఆరోపిస్తూ హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్‌కు మాజీ ఎంపీటీసీ బీరం రజనీకర్ రెడ్డి ఫిర్యాదు చేశారు. సోమవారం గ్రీవెన్స్ సెల్‌లో గ్రామ కార్యదర్శి అవినీతి, అక్రమాలకు పాల్పడ్డాడని మాజీ ప్రజా ప్రతినిధులు ఫిర్యాదు చేయగా, విచారణాధికారిచే విచారణ జరిపిన డీపీఓ అక్రమాలు జరిగినట్లు నిరూపణ అయినప్పటికీ ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై రజనీకర్ రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అవినీతికి పాల్పడిన కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# రిపోర్ట్ చేసిన ముగ్గురు కొత్త ఎస్సైలు

**వరంగల్ వాయిస్, మహబూబాబాద్:** జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ ఆదేశాల మేరకు మహబూబాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్‌కు ముగ్గురు కొత్త ఎస్సైలు బదిలీపై వచ్చారు. 2018 బ్యాచ్‌కు చెందిన టి. ప్రశాంత్ బాబు వరంగల్ కమిషనరేట్ నుంచి రాగా, అలాగే, 2024 బ్యాచ్‌కు చెందిన టి.అశోక్, బి.మౌనిక మహబూబాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్ హెచ్ఓ జి. మహేందర్ రెడ్డికి రిపోర్ట్ చేశారు.

# రైతు సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

## ◆ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**వరంగల్ వాయిస్, శాయంపేట:** రైతు సంక్షేమమే తమ ప్రభుత్వ లక్ష్యమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. శాయంపేట మండలం జోగంపల్లి చలివాగు ప్రాజెక్టు చెరువు నీటిని దిగువన ఉన్న పంట పొలాలకు సోమవారం ఆయన విడుదల చేశారు. ముందుగా తూము వద్ద కొబ్బరికాయ కొట్టి, చెరువులోకి పూలు చల్లిన ఎమ్మెల్యే, అనంతరం తూము గేట్ వాల్వ్‌ను తిప్పి నీటిని వదిలారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ మారేపల్లి రవీందర్, మాజీ జెడ్పీటీసీ చల్ల చక్రపాణి, నాయకులు పోలేపల్లి శ్రీనివాస్ రెడ్డి, అధికార ప్రతినిధి చిందం రవి, మాజీ సర్పంచులు అబ్బ ప్రకాష్ రెడ్డి, చిట్టి రెడ్డి రాజిరెడ్డి, నాయకులు తడక కుమారస్వామి, తడక లక్ష్మీనారాయణ, చింతల రైపాల్ పాల్గొన్నారు.

### జూబ్లీనగర్ నూతన బస్సు సర్వీస్ ప్రారంభం..

**వరంగల్ వాయిస్, రేగొండ:** జయశంకర్ జిల్లా ఉమ్మడి రేగొండ మండలం జూబ్లీనగర్ గ్రామంలో సోమవారం నూతన ఆర్టీసీ బస్సు సర్వీసును ప్రారంభించారు. పరకాల, చెన్నాపూర్, రేగొండ,



నారాయణపూర్, కొత్తపల్లి బి, భీం నగర్ తండా, జూబ్లీనగర్, రాజేశ్వరరావుపల్లి, నర్సాపూర్, పాపయ్యపల్లి, బందారుపల్లి మీదుగా ములుగు వరకు ఈ బస్సు సేవలు అందిస్తుంది. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి లాంఛనంగా రిబ్బన్ కట్ చేసి బస్సు సర్వీసును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పరకాల ఆర్టీసీ డీఎం ఎం. రవిచందర్, ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, తహశీల్దార్ శ్వేతా రావు, మండల పార్టీ అధ్యక్షుడు ఇప్పకాయల నరసయ్య, ఎన్ఎస్ఆర్ సంస్థల అధినేత నాయినేని సంపత్ రావు, ప్యాక్స్ చైర్మన్ నడిపెల్లి విజ్జన్ రావు, ఎంపీపీ పున్నం లక్ష్మి రవి, భూపాలపల్లి వ్యవసాయ కమిటీ చైర్మన్ గుటోజు కిష్టయ్య, కోడవటంచ ఆలయ కమిటీ చైర్మన్ ముల్కనూరి బిక్షపతి, జిల్లా నాయకులు మోడెమ్ ఉమేష్ గౌడ్, మేకల బిక్షపతి, గండి తిరుపతి గౌడ్, గంట రమణారెడ్డి, ఓబీసీ మండల అధ్యక్షులు పొనుగోటి వీరబ్రహ్మం, రేగొండ మాజీ ఎంపీటీసీ మైస బిక్షపతి, జూబ్లీనగర్ మాజీ సర్పంచ్ జంగేటి నరేష్, వ్యవసాయ కమిటీ సభ్యులు జంగేటి సుధాకర్, మాజీ ఎంపీటీసీ వెంకన్న, గ్రామ కమిటీ అధ్యక్షుడు చల్ల రవీందర్ రెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు కోయిలి క్రాంతి, గ్రామ యూత్ నాయకులు దానబోయిన రాజు తదితరులు పాల్గొన్నారు.

# జనగామ కలెక్టరేట్‌ను సందర్శించిన సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శేషాద్రి



**వరంగల్ వాయిస్, జనగామ:** ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ శేషాద్రి సోమవారం జనగామ జిల్లా కలెక్టరేట్‌ను సందర్శించారు. ఇటీవల వెలువడిన నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే (NAS) ఫలితాల్లో దేశవ్యాప్తంగా ఎంపికైన 50 జిల్లాల్లో జనగామ జిల్లాకు చోటు దక్కడంతో, ఈ పరీక్ష కోసం రూపొందించిన కార్యాచరణను వివరించడానికి ఆయన జిల్లాకు వచ్చారు. ముందుగా జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ప్రిన్సిపల్ సెక్రటరీ శేషాద్రికి ఘన స్వాగతం పలికారు. అనంతరం విద్యాశాఖ అధికారులు, NAS పరీక్ష కోసం కలెక్టర్ ఆదేశాల మేరకు రూపొందించిన కార్యాచరణను, క్షేత్ర స్థాయిలో వివిధ పాఠశాలల్లో దాని అమలు తీరును పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రిన్సిపల్ సెక్రటరీకి వివరించారు. అనంతరం కలెక్టర్ స్వయంగా కలెక్టరేట్‌లోని వివిధ విభాగాల అధికారులను, ఏ శాఖకు ఏ ఛాంబర్లు కేటాయించారనే వివరాలను ప్రిన్సిపల్ సెక్రటరీకి వివరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, ఆర్డీవోలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఆషాడ మాసం గోరింటాకు సంబరాలు

**వరంగల్ వాయిస్, తొర్రూరు:** దంతాలపల్లి మండలం దాట్ల ప్రాథమిక పాఠశాలలో ఆషాడ మాసాన్ని పురస్కరించుకొని సోమవారం ఆషాడ మాస గోరింటాకు సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని ఆటపాటలతో వేడుకను జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల సీనియర్ ఉపాధ్యాయినులు గోపు అనిత కుమారి, కే. కవిత మాట్లాడుతూ, ఆషాడ మాసంలో గోరింటాకు పెట్టుకోవడం వల్ల కలిగే లాభాలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్.కే. పాషా, ఉపాధ్యాయులు చింతల సురేష్, జి. అనిత, కే. రవీందర్, కే. కవిత, స్కావెంజర్ ఉమా, విద్యార్థులు పాల్గొన్నారు.

# మతోన్మాదాన్ని అడ్డుకునే శక్తులు కమ్యూనిస్టులే

## ◆ సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు బుర్రి ప్రసాద్



**వరంగల్ వాయిస్, జనగామ:** కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వ పాలనలో 11 సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ, నయా ఫాసిస్ట్ స్వభావంతో కూడిన కుల, మితవాద, మతోన్మాద, నిరంకుశ శక్తులు బలపడ్డాయని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు బుర్రి ప్రసాద్ అన్నారు. హిందుత్వ వర్గ కూటమికి మోడీ ప్రభుత్వం ప్రతినిధి అని, కాబట్టి బీజేపీ ఆర్ఎస్ఎస్‌ను, దానికి పునాదిగా ఉన్న హిందుత్వ కార్పొరేట్ మతోన్మాదాన్ని పెంచి పోషిస్తుందని ఆయన విమర్శించారు. జనగామ పట్టణంలోని పూసల భవనంలో రెండు రోజుల పాటు జరుగుతున్న రాజకీయ శిక్షణ తరగతుల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ శిక్షణ తరగతులకు జోగు ప్రకాష్ అధ్యక్షత వహించారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న మతతత్వం, కార్పొరేట్ విధానాలను సీపీఎం, ఇతర వామపక్ష పార్టీలు దృఢంగా వ్యతిరేకిస్తున్నాయని ప్రసాద్ స్పష్టం చేశారు. కార్మికులు, రైతాంగం, ఇతర కష్టజీవులు తమ జీవనోపాధిని, ఆర్థిక హక్కులను పరిరక్షించుకోవడానికి ఐక్య పోరాటాలు నడిపారని, దీనివల్లే బీజేపీ పార్లమెంటులో సీట్లు తగ్గాయని ఆయన అన్నారు. ప్రజలను మతం పేరుతో, కులం పేరుతో కొట్లాటలు పెడుతూ నిరుద్యోగం గురించి మాట్లాడకుండా యువతను పెడదోవ పట్టిస్తున్నారని బుర్రి ప్రసాద్ ఆరోపించారు. దీనివల్ల యువత తల్లిదండ్రులు, పిల్లలను పట్టించుకోకుండా రోడ్ల వెంట తిరుగుతున్నారని, నిరుద్యోగం పెరిగి ఆర్థిక ఇబ్బందులతో ప్రజలు కొట్టుమిట్టాడుతున్నారని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలను నిలబెట్టుకోవడంలో విఫలమైందని ప్రసాద్ విమర్శించారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలను ఇబ్బందులకు గురిచేయకుండా యువతకు ఉద్యోగాలు ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్లు తెల్ల రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఇవ్వాలని, ప్రజా సమస్యలను పరిష్కరించాలని ఆయన కోరారు. లేకపోతే యువతను, ప్రజలను ఐక్యం చేసి పెద్ద ఎత్తున ఆందోళనలు, పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాపర్తి రాజు, ఇర్రి అహల్య, బొట్ల శేఖర్, జిల్లా కమిటీ సభ్యులు బూడిది గోపి, సుంచు విజేందర్, పట్టణ కమిటీ సభ్యులు కళ్యాణం లింగం, పల్లెల లలిత, బొట్ల శ్రావణ్, బూడిది ప్రశాంత్, పగిడిపల్లి బాలమణి, గౌసియా, జయ, రజిత, అబ్రహం లింకన్, తిమోతి, కచగల వెంకటేష్, మాదా సుధాకర్, ఉపేందర్, వెంకటేష్, జయ, రజిత, అండాలు, కమల, అంజమ్మ, లక్ష్మమ్మ, సుగుణ, రేణుక, ఎండి మై వెల్లి, పద్మ, అండాలు, చింతల శ్రీలత, సమ్మక్క, రజియా, యాదలక్ష్మి, స్వప్న, మానవ, పావని, విజయ, శిరీష, అరుణ తదితరులు పాల్గొన్నారు.



# హరిహరవీరమల్లు రన్‌టైమ్ ఫిక్స్

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ తాజా చిత్రం 'హరి హర వీరమల్లు'. ఎ.ఎం. రత్నం సమర్పణలో మెగా సూర్య ప్రొడక్షన్ పతాకంపై ఎ. దయాకర్ రావు భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్న ఈ పీరియాడికల్ డ్రామాకు ఎ.ఎం. జ్యోతి కృష్ణ, క్రిష్ జాగర్లమూడి దర్శకులు. ఆస్కార్ విన్నర్ ఎం ఎం కీరవాణి సంగీతం అందిన్నారు. ఇటీవల రిలీజ్ చేసిన హరిహర వీరమల్లు థియేట్రికల్ -ట్రైలర్ కు అదిరిపోయే రెస్పాన్స్ వచ్చింది. ఈ నెల 24న ప్రపంచవ్యాప్తంగా విడుదల కాబోతున్న ఈ సినిమా సెన్సార్ కార్యక్రమాలు పూర్తి చేసుకుంది. మొత్తం 162 నిముషాల అనగా రెండు గంటల 42నిమిషాల రన్ -టైమ్ తో యూ/ఎ సర్టిఫికెట్ తో ఫైనల్ వర్షన్ ను లాక్ చేసారని సమాచారం. సినిమా వీక్షించిన సెన్సార్ టీమ్ నుండి హరిహర టీమ్ కు ప్రశంసలు లభించాయి. చారిత్రక నేపథ్యాన్ని చక్కగా చుపించారని దర్శకుడిని అభినందించారని తెలుస్తోంది. చాలా కాలంగా పవర్ స్టార్ సినిమా కోసం ఎదురు చూస్తున్న ఆయన ఫ్యాన్స్ కు హరిహర ఒక ఫీస్ట్ లా ఉండబోతుందని యూనిట్ బలంగా నమ్ముతోంది. నేడు సెన్సార్ టీ-మ్ అభినందించడంతో వారి నమ్మకం రెట్టింపైంది. ఇదే జోష్ లో హరిహర వీరమల్లు ప్రీ రిలీజ్ ఈవెంట్ కు సన్నాహకాలు చేస్తున్నారు. అందుకోసం వైజాగ్ వేదిక కాబోతుంది. ఈ నెల 20న హరిహర ప్రీ రిలీజ్ వేడుకకు ప్లాన్ చేస్తున్నారు. ఈ వేడుకకు రాజామౌళి ముఖ్య అతిథిగా రానున్నారు.

# ఆ సమయంలో అందుకే ఏడ్చేశా ..

నటి ఇలియానా 'దేవదాసు' అనే సినిమాతో తెలుగు తెరకు పరిచయం అయిన ఇలియానా బ్యూటీ- తన అందంతో, నటనతో ప్రేక్షకులను ఆకట్టుకుంది. దాంతో ఈ మూవీ తర్వాత నుంచి ఈమెకు అదిరిపోయే రేంజ్ క్రేజీ సినిమాల్లో అవకాశాలు వచ్చాయి. ప్రజంట్ ఇండస్ట్రీక్రి దూరంగా ఉండి.. తల్లి మాతృత్వాన్ని ఆస్వాదిస్తోంది. అయితే తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఇలియానా సినీ ప్రయాణంలో ఒక కీలక మలుపు గురించి పంచుకుంది.. సినీ రంగం బాహ్యంగా గ్లామరస్‌గా కనిపించినా, వాస్తవానికి చాలా ఒత్తిడులు, భావోద్వేగాలతో కూడి ఉంటుంది. ముఖ్యంగా 'దేవదాసు' సినిమా -టైమ్‌లో ఎదుర్కొన్న కష్టం ఎప్పటకి మర్చిపోలేను. ఫస్ట్ సినిమా కావడం వల్ల, సెట్స్‌లో కొత్త వాతావరణం, భాష, వర్క్ కల్చర్ వల్ల ఒత్తిడి ఎక్కువయ్యింది. దీంతో మా అమ్మకి ఫోన్ చేసి 'సినిమా వదిలేస్తానని' ఏడ్చిన.. ఆ సమయంలో తల్లి ధైర్యం చెప్పడం వల్లే ఆమె ఆ సినిమాను పూర్తి చేయగలిగాను. ఈ సంఘటన నా జీవితాన్ని మార్చేసింది. అదే సినిమా నన్ను స్టార్ గా నిలిపింది. ఒత్తిడిలోనూ ధైర్యంగా ముందుకెళ్లడం ఎంత అవసరమో, మన కుటుంబ సభ్యుల మద్దతు కూడా అంతే ముఖ్యం' అని చెప్పుకొచ్చింది.




# ప్రభాస్‌తో స్కీన్ షేర్ చేసుకోవడం అదృష్టం

### కన్నప్ప బ్యూటీ నటి ప్రీతి ముకుందన్.

ఇటీవల వచ్చిన 'కన్నప్ప'తో ప్రేక్షకులకు మరింత చేరువయ్యారు నటి ప్రీతి ముకుందన్. ఆ సినిమాలో అగ్ర కథానాయకుడు ప్రభాస్ కీలకపాత్రలో కనిపించిన సంగతి తెలిసిందే. ఆయనతో కలిసి స్క్రీన్ షేర్ చేసుకోవడంపై ప్రీతి తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. ప్రభాస్ చాలా స్వీట్ పర్సన్ అని అన్నారు. కన్నప్ప లాంటి భారీ ప్రాజెక్ట్‌లో అనుకోకుండా అవకాశం వచ్చింది. కొన్నిసార్లు మన ప్రమేయం లేకుండా ఇలాంటి పెద్ద సినిమాలు మనల్ని వెతుక్కుంటూ వస్తాయి. సవాలుగా ఉండే పాత్రలంటే నాకు ఇష్టం. అవి కష్టంగా ఉన్నప్పటికీ గుర్తింపు తెస్తాయి. అలాంటి పాత్రలు ఉంటే ఆడిషన్ ఇవ్వడానికి సిద్ధమే. కన్నప్పలో ప్రభాస్‌తో (సశశిరశ) కలిసి నటించడం ఎప్పటికీ మర్చిపోలేని అనుభవం. ఆయన ఎక్కడ ఉంటే అక్కడ పాజిటివిటీ- ఉంటు-ంది. ఆయన ప్రత్యేకత స్క్రీన్‌పై కూడా స్పష్టంగా కనిపించింది. నిజజీవితంలోనూ ప్రభాస్ చాలా స్వీట్ పర్సన్. ఆయన పాన్ ఇండియా స్టార్ అయినప్పటికీ సాధారణంగా ఉంటారు. ఎవరినీ చిన్నచూపు చూడరు. సెట్‌లో అందరినీ గౌరవిస్తారు' అని ప్రీతి ముకుందన్ చెప్పారు. మంచు విష్ణు హీరోగా వచ్చిన 'కన్నప్ప'లో ప్రభాస్ రుద్ర అనే పవర్‌ఫుల్ పాత్రలో కనిపించారు. వీరిద్దరి మధ్య సంభాషణలు సినిమాకే హైలైట్‌గా నిలిచి ఆకట్టు-కున్న విషయం తెలిసిందే. ఇక 'ఓం భీమ్ బుష్'తో టాలీవుడ్‌కు పరిచయమైన ప్రీతి ముకుందన్ 'కన్నప్ప'తో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ప్రస్తుతం 'మైనే ప్యార్ కియా'లో నటిస్తున్నారు. ఈ రొమాంటిక్ కామెడీ చిత్రం ఆగస్టు 29న విడుదల కానుంది






# కొత్తపల్లిలో ఒకప్పుడు నుంచి సాంగ్ విడుదల

ప్రవీణ పరుచూరి దర్శకురాలిగా పరిచయమవుతున్న చిత్రం 'కొత్తపల్లిలో ఒకప్పుడు' ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ సినిమా జులై 18న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇటీవలే విడుదలైన ఈ సినిమా -ట్రైలర్ ఆకట్టు-కుంది. తాజాగా ఈ చిత్రంలోని 'రంగనాయకి' సాంగ్ లిరికల్ వీడియో రిలీజైంది. గ్రామీణ నేపథ్యంలో చిత్రీకరించిన ఈ మెలోడీ సాంగ్ అభిమానులను అలరిస్తోంది. మణిశర్మ ఈ పాటను కంపోజ్ చేశారు. ధనుంజయ్ సీపాన ఆలపించారు. చైతన్య ప్రసాద్ లిరిక్స్ అందించారు. ఈ చిత్రంలో రవీంద్ర విజయ్, బెనర్జీ తదితరులు కీలక పాత్రలు పోషించారు.

వరంగల్ వాయిస్ Evening Daily
GREATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
సోమవారం, జూలై 14, 2025

# డాక్టర్స్ కాపురంలో రీల్స్ చిచ్చు

- 'బుట్ట బొమ్మ'పరిచయంతో కుటుంబంలో కలహాలు
- మనస్థాపంతో భార్య ప్రత్యూష ఆత్మహత్య
- నలుగురిపై కేసు నమోదు







**వరంగల్ వాయిస్, హసన్ పర్తి :** ఎంతో అన్యోన్యంగా సాగిపోతున్న డాక్టర్స్ కాపురంలోకి బుట్ట బొమ్మ పేరుతో మరో వ్యక్తి ఎంట్రీ ఇవ్వడంతో.. పచ్చని కాపురంలో కలహాలు రేగాయి. భర్త ఇన్ స్టాగ్రామ్ లో రీల్స్ చేసే అమ్మాయితో ప్రేమలో పడ్డాడని అనుమానించి భార్య.. అతనితో వాదనలకు దిగింది. అయిన ఆయనలో మార్పు కనిపించకపోవడంతో ఆత్మహత్యతో తనువు చాలించింది. ఈ దారుణం ఘటన హనుమకొండ జిల్లా హసన్ పర్తిలో చోటుచేసుకుంది. డాక్టర్ ప్రత్యూష బంధువులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు డెంటిస్ట్ డాక్టర్ ప్రత్యూషకు కార్డియాలజిస్ట్ డాక్టర్ అల్లాడి సుజన్ తో 2017లో వివాహమైంది. వీరికి ఏడు సంవత్సరాల జానుషా సృజన్, ఏడు నెలల జెస్వికాస్ సృజన్ ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. డాక్టర్ ప్రత్యూష ఎన్ఎస్ఆర్ హాస్పిటల్ లో డెంటింస్ట్ గా పనిచేస్తున్నారు. డాక్టర్ సృజన్ హంటర్ రోడ్డులోని మెడికవర్ హాస్పిటల్ లో కార్డియాలజిస్ట్ గా విధులు నిర్వహిస్తున్నారు. కాగా డాక్టర్ సృజన్ ను సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్ బుట్ట బొమ్మ శృతి ఇంటర్వ్యూ చేసింది. ఆ వీడియోలను రీల్స్ గా ప్రమోట్ చేయడంతో ఇద్దరి మధ్య పరిచయం స్నేహంగా ఆపై ప్రేమగా మారింది. విషయం ప్రత్యూషకు తెలియడంతో నిలదీసింది. ఈ విషమంలో ఇద్దరి మధ్య పలుమార్లు గొడవలు కూడా జరిగినట్లు వెల్లడించారు. అయితే భార్యగా తానుండగా.. మరో యువతిని భర్త ప్రేమించడాన్ని ప్రత్యూష భరించలేకపోయింది. ఈ విషయం సృజన్ తల్లిదండ్రులకు చెప్పినా వారు పెద్దగా పట్టించుకోకపోవడం, శృతి నేరుగా ఫోన్ చేసి ప్రత్యూషను బెదిరించడంతో తట్టుకోలేక పోయింది. దీంతో మనస్థాపానికి చెందిన ప్రత్యూష (35) హసన్ పర్తి మండల కేంద్రంలోని కాకతీయ వెంటేజ్ లోని స్వగృహంలోనే ఊరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ మేరకు ప్రత్యూష తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా డాక్టర్ అల్లాడి సృజన్, ఆయన తల్లి దండ్రులు అల్లాడి మధుసూదన్, అల్లాడి పుణ్యవతితోపాటు బుట్టబొమ్మ బానోతు శృతిలపై కేసు నమోదు చేశారు.

# గ్రీవెన్స్ అర్జీలను త్వరగా పరిష్కరించాలి

- కలెక్టర్ల ఆదేశం
- హనుమకొండలో 206, వరంగల్ లో 150 దరఖాస్తులు
- జీడబ్ల్యూఎంసీకి 119 అర్జీలు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ప్రజావాణికి వచ్చిన అర్జీలను వీలైనంత త్వరగా పరిష్కరించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సూచించారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో ప్రజావాణి కార్యక్రమాన్ని జిల్లా అధికారులతో కలిసి కలెక్టర్ నిర్వహించారు. ప్రజలు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ 206 అర్జీలను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ వచ్చిన అర్జీలను సంబంధిత శాఖల అధికారులు త్వరగా పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి వైవి.గణేష్, డీఆర్డీవో మేన శ్రీను, హనుమకొండ, పరకాల ఆర్డీవోలు రాథోడ్ రమేష్, డాక్టర్ కె.నారాయణ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

### యూరియా కొరతను నివారించాలి..

జిల్లాలో రైతులకు తగినంత యూరియాను అందించాలని కోరుతూ వరంగల్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ, అఖిల భారత రైతు కూలి సంఘం (ఏఐకేఎంఎస్) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి అనంతరం గ్రీవెన్స్ లో కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు ఎలకంటి రాజేందర్, జిల్లా అధికార ప్రతినిధి గంగుల దయాకర్, ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాచర్ల బాలరాజు, మానవ హక్కుల వేదిక జిల్లా నాయకులు బండి కోటేశ్వరరావు, నాయకులు గట్టి కృష్ణ, బండి కుమార్, జి.అశోక్, ఇనుముల కృష్ణ తదితరులు పాల్గొన్నారు. కాగా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, అదనపు కలెక్టర్ జి.సంధ్యారాణి, జడ్పీ సీఈవో రామ్ రెడ్డి, డీఆర్డీఓ కౌసల్యాదేవి, ఆర్డీవోలు వరంగల్ సత్యపాల్ రెడ్డి, నర్సంపేట ఉమారాణి, హౌసింగ్ పీడీ గణపతి పాల్గొని ప్రజలనుంచి దరఖాస్తులు స్వీకరించారు. ప్రజావాణిలో మొత్తం 150 దరఖాస్తులు రాగా ఇందులో రెవెన్యూ శాఖకు సంబంధించినవి 58, పీడీ హౌసింగ్ 25, జీడబ్ల్యూఎంసీ 13, ఇతర శాఖలకు సంబందించిన 54 దరఖాస్తులు వచ్చాయి.

### బల్దియాలో 119..

సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ లో కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ పాల్గొని ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా 119 దరఖాస్తులు రాగా అందులో టౌన్ ప్లానింగ్ విభాగానికి చెందినవి 62, ఇంజనీరింగ్ కు చెందినవి 29, హెల్త్ & సానిటేషన్ 12, ప్రాపర్టీ టాక్స్ (రెవెన్యూ) 14, మంచినీటి సరఫరా ఒకటి, హార్టికల్చర్ ఒకటి వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ జోనా సీఎంహెచ్ఓ డాక్టర్ రాజారెడ్డి, డీఎఫ్ఓ శంకర్ లింగం, వెటర్నరీ వైద్యులు డాక్టర్ గోపాల్ రావు, పన్నుల అధికారి రామకృష్ణ, ఇంచార్జి ఎస్ఈ, సిటీ ప్లానర్ లు మహీందర్, రవీందర్ రాడేకర్, హెచ్ఓలు రమేష్, లక్ష్మారెడ్డి, డిప్యూటీ కమిషనర్ ప్రసన్న రాణి, ఎంహెచ్ ఓ డాక్టర్ రాజేష్, హెచ్ఓ రమేష్ తదితరులు పాల్గొన్నారు. కాగా 40 వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి కమిషనర్ ను కలిసి మంకీ ఫుడ్ కోర్ట్, ఉప్పరోనికుంట, ఎన్ఎస్ఆర్ కాలనీ, ప్రగతి నగర్, తాళ్లమండువ, తాళ్ల దర్గా వద్ద నూతనంగా ఏర్పడిన కాలనీల్లో ఫ్లోరైడ్ వాటర్ తో స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారని సూచించారు. కొత్తగా వెలిసిన కాలనీల్లో వెంటనే కరెంట్ పోల్స్, తాగు నీటి వసతి కల్పించాలని కోరారు.

# బీసీలు ఏకం కావాలి

**వరంగల్ వాయిస్, బాలసముద్రం :** ఈ నెల 15న బీసీలను ఐక్యం చేయడమే లక్ష్యంగా నిర్వహించనున్న 'ఛలో హైదరాబాద్' ను విజయవంతం చేయాలని ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షులు దాస్యం వినయ్ భాస్కర్ పిలుపునిచ్చారు. బాలసముద్రంలోని బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా కార్యాలయంలో సోమవారం వెనుకబడిన తరగతుల ప్రజాప్రతినిధుల వేదిక నిర్వహిస్తున్న 'హలో బీసీ చలో హైదరాబాద్' కార్యక్రమ పోస్టర్ ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ బీసీలతో కాంగ్రెస్ ఓట్ల రాజకీయం చేస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ బీసీలను రాజకీయంగా, ఆర్థికంగా మోసం చేస్తోందని, కాంగ్రెస్ మోసాన్ని ఎండగట్టేందుకు బీసీలందరూ ఏకమై సమర శంఖం పూరించాలని సూచించారు. జూలై 15 న హైదరాబాదులోని ఇందిరాపార్క్ వద్ద నిర్వహించనున్న బీసీల మహాధర్నా కార్యక్రమానికి పెద్ద ఎత్తున బీసీలందరూ హాజరుకావాలని కోరారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో కార్పొరేటర్ సోదా కిరణ్, బీసీ నాయకులు పులి రజినీకాంత్ ముదిరాజ్, నరెడ్ల శ్రీధర్, దూలం వెంకన్న గౌడ్, గండు అశోక్ యాదవ్, మూటిక రాజు యాదవ్, గంద్రకోట రాకేష్ యాదవ్, బుద్దె వెంకన్న పెరుక, పోలపెల్లి రామ్మూర్తి రజక, గుల్లపెల్లి వీరాస్వామి నయీ బ్రాహ్మణ, పబ్బోజు శ్రీకాంత్ చారి, రాజ్ కుమార్, పబ్బతి రాకేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.





# నల్లాల సర్వే చేపట్టండి

- బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్

**వరంగల్ వాయిస్, వరంగల్ :** నగర పరిధిలో పారదర్శకంగా నల్లాల సర్వే చేపట్టాలని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అధికారులను అదేశించారు. సోమవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో ఇంజనీరింగ్, రెవెన్యూ అధికారులతో నల్లాల సర్వే నిర్వహణపై ఏర్పాటు చేసిన సమావేశంలో కమిషనర్ పాల్గొని సమర్థవంతంగా చేపట్టుటకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నల్లాలకు సంబంధించి వివిధ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. నగర వ్యాప్తంగా ఇప్పటికే సుమారు 70 వేల వరకు నల్లా కనెక్షన్ లు సమస్యాత్మకంగా ఉన్నట్లు గుర్తించడం జరిగిందన్నారు. ఇందులో ప్రధానంగా నాలుగు కేటగిరీలకు చెందిన అనధికారిక నల్లా కనెక్షన్ల గుర్తింపు, డబుల్ నల్లాల గుర్తింపు, బల్క్ వాటర్ వినియోగిస్తున్న వారిని గుర్తించడం, సీఏఎన్ నంబర్లు లేని నల్లాల గుర్తింపుకు సంబంధించి అసిస్టెంట్ ఇంజనీర్ల ఆధ్వర్యంలో బిల్ కలెక్టర్లు వార్డు ఆఫీసర్లతో 11 బృందాలను ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి ఎస్ఈ మహేందర్, పన్నుల అధికారి రామకృష్ణ, డిప్యూటీ కమిషనర్ ప్రసన్న రాణి, ఈఈ మాధవి లత, ఏఈలు, వార్డు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### సమస్యల పరిష్కారంపై శ్రద్ధ చూపండి

కౌన్సిల్ లో ప్రస్తావించిన సమస్యల పరిష్కారంపై శ్రద్ధ చూపాలని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ జోనా, సీఎంహెచ్ఓ డాక్టర్ రాజారెడ్డి, డీఎఫ్ఓ శంకర్ లింగం, వెటర్నరీ వైద్యులు డాక్టర్ గోపాల్ రావు, పన్నుల అధికారి రామకృష్ణ, ఇంచార్జి ఎస్ఈ, సిటీ ప్లానర్ లు మహీందర్, రవీందర్ రాడేకర్, హెచ్ఓలు రమేష్, లక్ష్మారెడ్డి, డిప్యూటీ కమిషనర్ ప్రసన్న రాణి, ఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్, హెచ్ఓ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com